సాక్షి
ప్రకాశం

మంగళవారం | 24 | జనవరి | 2023



వైఎస్సార్‌ సీపీ జెండా ఎగరేద్దాం

వచ్చే ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్‌ సీపీ జెండా ఎగరేద్దామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

- IIలో..



ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టారు. 35 మందికి కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ అందజేశారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
30 /19

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్‌

నేటి నుంచి జేఈఈ మెయిన్‌ పరీక్షలు

ఒంగోలు: దేశవ్యాప్తంగా నేటి నుంచి జరుగుతున్న జేఈఈ మెయిన్‌ పరీక్షలకు జిల్లాలో ఒంగోలు సమీపంలోని రైజ్‌ ఇంజినీరింగ్‌ కాలేజీని పరీక్ష కేంద్రంగా కేటాయించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో షిఫ్ట్‌కు 100 నుంచి 120 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆరు రోజులపాటు జరుగుతాయి.

జిల్లా స్థాయి బాక్సింగ్‌ పోటీలు ప్రారంభం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: సీఎం కప్‌ టోర్నమెంట్‌లో భాగంగా మార్కాపురంలోని డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ క్రీడా వికాస కేంద్రంలో జిల్లా స్థాయి బాక్సింగ్‌ పోటీలను సోమవారం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రారంభించారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ బాక్సింగ్‌ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్‌ కోచ్‌ పీ.వేణు, జిల్లా స్పోర్ట్స్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ రాజరాజేశ్వరి, నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, కాశంగి శ్రీనివాసరావు, జి.కిరణ్‌ కుమార్‌, హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, కాంట్రాక్టర్‌ బి.వెంకటేశ్వరరెడ్డి, పీ.లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


నేడు ఉపాధ్యాయుల సర్దుబాటుకు కౌన్సెలింగ్‌

ఒంగోలు: జిల్లాలోని పాఠశాలల్లో వర్క్‌ అడ్జస్ట్‌మెంట్‌ కింద సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులను నియమించేందుకు ఈనెల 18న అవగాహన లోపం వల్ల అంగీకారం తెలియజేయలేకపోయిన ఉపాధ్యాయులు మంగళవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని డీఈవో బి.విజయభాస్కర్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌ అసిస్టెంట్‌ వరుస సంఖ్య 66 నుంచి ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌ ప్రారంభమవుతుందన్నారు. ఎస్‌జీటీ స్కూల్‌ అసిస్టెంట్‌ గణితం, సోషల్‌, ఇంగ్లిష్‌, బయోలాజికల్‌ సైన్స్‌ సబ్జక్టుల్లో సీనియార్టీలో ఉన్నవారికి ఉదయం 9 నుంచి వెరిఫికేషన్‌, మధ్యాహ్నం వర్క్‌ అడ్జస్ట్‌మెంట్‌ కౌన్సెలింగ్‌ ఉంటుందన్నారు. సెకండరీ గ్రేడ్‌ టీచర్ల సీనియార్టీ లిస్టులు డీఈవోప్రకాశం.కో.ఇన్‌ అనే వెబ్‌సైట్‌లో ఉంచారని, జాబితాలో పేరు ఉండి, ఈనెల 18న కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు మంగళవారం ఉదయం 9 గంటలకు తప్పక హాజరుకావాలన్నారు.

పెద్దపులి దాడిలో ఎద్దు మృతి

అర్థవీడు (కంభం): మండలంలోని మాగుటూరు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపినట్లు మార్కాపురం రేంజ్‌ అధికారి వేణు తెలిపారు. చనిపోయిన ఆవు మాగుటూరు గ్రామవాసి గురుస్వామికి చెందినదిగా గుర్తించారు. రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వేగంకంటే ప్రాణం మిన్న



క్విస్‌ కాలేజీలో రవాణా శాఖ అవగాహన సదస్సు

ఒంగోలు టౌన్‌: వేగంగా కంటే ప్రాణం మిన్న అనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు వాహనాలు నడపాలని రవాణా కమిషనర్‌ డాక్టర్‌ శ్రీకృష్ణవేణి సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా క్విస్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఇంట్లో అమ్మానాన్నలు మన కోసం వేచి చూస్తుంటారన్న ఆలోచనను మనసులో ఉంచుకొని వాహనాలు నడపాలని హితవు పలికారు. అతి వేగం వల్ల ఎందరో యువకులు తమ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవడాన్ని గమనించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ట్రిబుల్‌ రైడింగ్‌ ప్రమాదకరమని, ఏమాత్రం చిన్న పొరపాటు జరిగినా జీవితాంతం అనుభవించాల్సి వస్తుందన్నారు. లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపరాదని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాల గురించి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని, తమ బిడ్డలకు వాహనాలను కొనిచ్చే ముందే నిబంధనల గురించి వివరించి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా ఇన్‌స్పెక్టర్లు ఏ.కిరణ్‌ ప్రభాకర్‌, కె. రాఘవేంద్ర రావు, సురేంద్ర ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.



నల్లమల అటవీ ప్రాంతం

నల్లమల అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులు బలవుతున్నాయి. వేటగాళ్ల ఆటకట్టించేందుకు, అటవీ సంపదను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. వేటగాళ్లపై నిరంతర నిఘా పెట్టి వారి కదలికను నియంత్రిస్తున్నారు. అభయారణ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు గూడేలలో గార్డుల నిఘాతోపాటు కొరియర్‌ వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. ఇటీవల కాలంలో 15 కేసులు నమోదు చేసి 35 మంది వేటగాళ్లను జైలుకు పంపారు.

నల్లమలలో నిఘా

- వేటగాళ్లపై వేటు
- వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- అభయారణ్యంలో సీసీ కెమెరాలు
- సమీప గ్రామాల్లో గస్తీలు ముమ్మరం
- గార్డుల డ్యూటీలు.. కొరియర్‌ వ్యవస్థ పటిష్టం
- 5 నెలల్లో 15 కేసులు 35 మంది అరెస్టు

మార్కాపురం: జిల్లాలో 3568 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించింది. మార్కాపురం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, కంభం, గిద్దలూరు, కొనకనమిట్ల, తర్లుపాడు, పొదిలి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు పరిధిలో ఉన్న అటవీ సమీప గ్రామాల్లో వన్యప్రాణులను వేటాడడం, అటవీ సంపదను వేటగాళ్లు దోచుకుంటున్నారు. మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ పరిధిలో మార్కాపురం, దోర్నాల, కొర్రపోలు, నెక్కంటి, గంజీవారిపల్లి, యర్రగొండపాలెం, విజయపురి సౌత్‌లో అటవీ శాఖ అధికార కార్యాలయాలు ఉన్నాయి. వీరి పరిధిలో ఏడుగురు రేంజ్‌ ఆఫీసర్లు, పది మంది డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్లు, 14 మంది సెక్షన్‌ ఆఫీసర్లు, 60 మంది బీట్‌ అధికారులు ఉన్నారు. వేటగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు అభయారణ్యంలో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. ఏమాత్రం కదలికలు కనిపించినా వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో వేటగాళ్లు గిరిజన గూడేలు, సమీప గ్రామాలను ఎంపిక చేసుకుని నిరంతరం వన్యప్రాణులను సంహరిస్తున్నారు. జింకలు, దుప్పులు, కణుతులు, కుందేళ్లను రాత్రిపూట వేటకు వెళ్లి ఉచ్చులేసి చంపి విక్రయిస్తున్నారు. దీంతో రేంజ్‌ ఆఫీసర్లు, బీట్‌ ఆఫీసర్లు గార్డులు, నిఘా పెట్టారు. కొరియర్‌ వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. ఐదు నెలల కాలంలో 35 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసులకు సంబంధించి మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌ కార్యాలయ పరిధిలో 35 మంది వేటగాళ్లను అరెస్టు చేశారు. దాదాపు 2.25 లక్షల అపరాధ రుసుము విధించారు. మార్కాపురం పరిధిలో 9 కేసుల్లో 19 మందిని, పెద్దదోర్నాల పరిధిలో 3 కేసుల్లో 10, యర్రగొండపాలెం పరిధిలో 1 కేసులో 3, విజయపురి సౌత్‌ పరిధిలో 2 కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేశారు. రాత్రిపూట అటవీశాఖ సిబ్బంది గస్తీని పెంచారు. అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.

వేటాడితే కఠిన చర్యలు



వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అటవీ జంతువులు కనిపిస్తే ఎవరూ చంపవద్దు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలి. 1972 వన్యప్రాణి చట్టం ప్రకారం శిక్షలు అమలవుతాయి.

– విఘ్నేష్‌ అప్పావ్‌, డీడీ, మార్కాపురం

ముఖ్య సంఘటనలు

- సెప్టెంబర్‌ 24న కలుజువ్వలపాడు దగ్గర కుందేళ్లను వేటాడుతున్న ఇద్దరు వేటగాళ్లను అరెస్టు చేశారు.
- సెప్టెంబర్‌ 1న కొనకనమిట్ల మండలం మునగపాడు వద్ద ముగ్గురు వేటగాళ్లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.
- నవంబర్‌ 7న పట్టణంలోని బాపూజీ కాలనీకి చెందిన ముగ్గురు వేటగాళ్లను అరెస్టు చేశారు.

వీరితో పాటు దోర్నాల మండలం కొత్తూరు వద్ద అడవిపందిని పట్టుకుని చంపి మాంసం విక్రయిస్తున్న వేటగాళ్లను అరెస్టు చేశారు. మార్కాపురం మండలం చింతగుంట్ల పరిధిలో ఇద్దరు వేటగాళ్లను, బోడపాడు వద్ద అక్టోబర్‌లో ఇద్దరు వేటగాళ్లను అరెస్టు చేశారు. గత నెలలో గిద్దలూరులో కూడా పలువురు వేటగాళ్లను అరెస్టు చేశారు.



అరెస్టు చేసిన వేటగాళ్లతో ఫారెస్టు అధికారులు (ఫైల్‌)

● పాయల్‌ హంగామా..



సినీతార పాయల్‌రాజ్‌పుత్‌ సోమవారం ఒంగోలు నగరంలో సందడి చేసింది. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె నీలిరంగు దుస్తుల్లో మెరిసింది. ఫొటోలకు ఫోజులిచ్చి కుర్రకారు మదిని గిలిగింతలు పెట్టింది. తెలుగు, పంజాబీ, కన్నడ తమిళం, హిందీ తదితర భాషల్లో పలు చిత్రాల్లో నటించింది.

– ఒంగోలు

సంక్షేమ ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో



33వ డివిజన్‌ జెడ్పీకాలనీలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ బాలినేని శ్రీనివాసరెడ్డి

- బాధల్లో ఉండే వారిని అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్‌ జగన్‌
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు
- 33వ డివిజన్‌ గడప గడపకు మన ప్రభుత్వంలో వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్‌: గతంలో ఎవరూ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ దేశంలోనే ఏకైక సంక్షేమ ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందని వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో సోమవారం 33వ డివిజన్‌ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. డివిజన్‌ కార్పొరేటర్‌ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డిలతో కలిసి ముంగమూరు రోడ్డులోని జెడ్పీ కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొన్నందువల్లే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను రావాలంటే ఎవరో ఒకరు చనిపోతే కానీ కొత్తవాళ్లకు ఇచ్చేవారు కాదన్నది జగమెరిగిన సంగతేనని గుర్తు చేశారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అలా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో మంజూరు చేసుకుంటూ పోతున్న సీఎం వైఎస్‌ జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇచ్చి ఆయనకు కొండంత బలాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు. గడప గడప కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌తో పాటు ఏపీ జేఏసీ, రెవెన్యూ అసోసియేషన్‌, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం, కంప్యూటర్‌ ఆపరేటర్ల సంఘం, డ్రైవర్ల అసోసియేషన్‌ను బాలినేనికి ఘనంగా స్వాగతం పలికారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్‌ గంగాడ సుజాత, కమిషనర్‌ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్‌, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, వేమూరి భవాని, నీలంరాజు సరోజ, చింతపల్లి గోపీ చంద్‌, ప్రవీణ్‌ కుమార్‌, ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన్‌ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్‌, గొర్రెపాటి శ్రీనివాసరావు, చింతగుంట్ల సువర్ణ, కొమ్మూరి రవిచంద్ర, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కరుణాకర్‌, ఊసా మధుబాబు, బైరెడ్డి అరుణ, తోటపల్లి సోమశేఖర్‌, గోలి తిరుపతి రావు, జే.పున్నయ్య, రావులపల్లి నాగేశ్వరరావు, నక్కల లీలా కుమారి, జిళ్ళెల్లమూడి రమాదేవి, మైనార్టీ నాయకుడు మహబూబ్‌ బాష, మీరావలి, డివిజన్‌ అధ్యక్షుడు పందిటి కాశీరామ్‌(జేమ్స్‌), ఎస్‌కే నాగూర్‌, ఓగిరాల శ్రీనివాసులు, జయరామిరెడ్డి, కోటా రాంబాబు, నగేష్‌, ముంతాజ్‌, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రమాదేవి, మద్దులూరి వెంకటేశ్వర్లు, శోభ, ఏసు, బక్కా రోశయ్య, బాబూరావు, పింగల సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అమరజీవిగా చరిత్రకెక్కిన పొట్టి శ్రీరాములు



- ముంగమూరు రోడ్డు జంక్షన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన బాలినేని

ఒంగోలు సబర్బన్‌: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం తన తుది శ్వాస వరకు పోరాడి అమరజీవిగా పొట్టి శ్రీరాములు చరిత్రకెక్కారని వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ముంగమూరు రోడ్డు జంక్షన్‌లో సోమవారం రాత్రి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాల గురించి వివరించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరవలేనిదన్నారు. ఆయన త్యాగం గురించి నేటి తరం యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్‌ గంగాడ సుజాత, వైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ కుప్పం ప్రసాదు, డిప్యూటీ మేయర్‌ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్‌ ఆదిపూడి గిరజా శంకర శాండిల్య, విగ్రహ నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షుడు హేమంత్‌ కుమార్‌, గునుపూడి నరశింహారావు, వీరాంజనేయులు, సుబ్బారావు, వెంకట నారాయణ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలి



అండర్‌-17 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన నెల్లూరు జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌ పోటీలు

ఆత్మకూరు: 'విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలి. పుట్టిన ఊరు, తల్లిదండ్రులు గర్వపడేలా క్రీడల్లో ఉన్నతస్థాయి చేరుకోవాలి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయి అండర్‌-14, 17 నెట్‌బాల్‌ పోటీలు మూడు రోజులుగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం ఫైనల్స్‌ జరిగాయి. ముగింపు కార్యక్రమానికి విక్రమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ ఉంటుందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి క్రీడాకారులకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను అదే కోవలో పయనిస్తానన్నారు. రానున్న రోజుల్లో జరిగే నెట్‌బాల్‌ పోటీల్లో క్రీడాకారులకు షూతోపాటు దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జి.వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ షేక్‌ సర్దార్‌, కమిషనర్‌ ఎం.రమేష్‌బాబు, గుంటూరు ఆర్‌ఐపీ మహబూబ్‌బాషా, శాప్‌ డైరెక్టర్‌ కాలువ నరసింహులు, స్కూల్‌ గేమ్స్‌ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్‌ సూరా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

అండర్‌-14 బాలికల విభాగంలో వైఎస్సార్‌ జిల్లా జట్టు ప్రథమ స్థానం, అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు, బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు ప్రథమ స్థానం, వైఎస్సార్‌, అనంతపురం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అదే విధంగా అండర్‌-17 బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు ప్రథమ స్థానం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవశం చేసుకోగా, వెస్ట్‌ గోదావరి, వైఎస్సార్‌ జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయని నిర్వాహకుడు పీఈటీ తిరుపతయ్య తెలిపారు.

25న సెబ్‌లో వాహనాల వేలం

ఒంగోలు టౌన్‌: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 25వ తేదీ ఒంగోలు సెబ్‌ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ బి.లత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు సెబ్‌ డిప్యూటీ కమిషనర్‌ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3 వేల డిపాజిట్‌ చెల్లించాలన్నారు. ఉదయం 11 గంటలకు వేలంపాట ప్రారంభించనున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు బొమ్మరిల్లు చిన్నారులు

- ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్‌ ఏఎస్‌.దినేష్‌ కుమార్‌



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్‌

ఒంగోలు సబర్బన్‌: జాతీయ స్థాయి క్యారమ్స్‌ పోటీలకు ఒంగోలులోని బొమ్మరిల్లు అనాథాశ్రమ చిన్నారులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రకాశం భవన్‌ ప్రాంగణంలో చిన్నారులను కలెక్టర్‌ ఏఎస్‌.దినేష్‌ కుమార్‌ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 21వ తేదీ నుంచి విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్‌ 18 విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండవ, నాల్గవ, ఆరో స్థానాలను వరుసగా బి.అంజి, జీ.రాజేష్‌, పి.పవన్‌, వి.జీవన్‌ కుమార్‌ దక్కించుకున్నారు. బాలికల విభాగంలో మూడో స్థానంలో కే.సోనీ, ఆరో స్థానంలో బి.గంగోత్రి నిలిచారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జాతీయ స్థాయి పోటీలు ముంబైలో నిర్వహిస్తున్నారు. అందు కోసం ప్రత్యేకంగా క్రీడాకారులను కలెక్టర్‌ అభినందించారు. విజేతలకు కలెక్టర్‌ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకులు పి.రాజ్యలక్ష్మి, ఎస్‌ఎండి ఖాసీం ఉన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- రెవెన్యూ పిటిషన్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి
- కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు సబర్బన్‌: స్పందన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ అధికారులను హెచ్చరించారు. ప్రకాశం భవన్‌లో సోమవారం స్పందన, డయల్‌ యువర్‌ కలెక్టర్‌ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ముఖ్యంగా రెవెన్యూ పిటిషన్లను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించకుండా కార్యాలయాలకే పరిమితమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలన్నారు. అర్జీలను సంబంధిత అధికారుల నిర్దిష్ట గడువు లోగా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలన్నారు. డయల్‌ యువర్‌ కార్యక్రమంలో ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎం.అభిషిక్త్‌ కిషోర్‌, డీఆర్‌ఓ బి.చినఓబులేసు, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ సరళా వందనం, ఉమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అభిషిక్త్‌ కిషోర్‌

కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

- వైఎస్సార్‌సీపీ పాలనలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఘనంగా కొండపి ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



కొండపి ఏఎంసీ చైర్‌పర్సన్ శారదకు నియామక పత్రం అందజేస్తున్న బాలినేని, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఒంగోలు మేయర్ సుజాత, అశోక్‌బాబు తదితరులు

టంగుటూరు(కొండపి): వచ్చే ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని వైఎస్సార్ సీపీ రీజినల్ కోర్డినేటర్ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. టంగుటూరులోని ఓ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కొండపి నూతన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొండపి ఏఎంసీ నూతన కమిటీతో ఏఎంసీ కార్యదర్శి నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఏఎంసీ చైర్‌పర్సన్ గోగినేని శారద, వైస్ చైర్మన్ మాలె రంగారెడ్డితోపాటు మిగిలిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తోందన్నారు. మహిళలకు గతంలో ఎన్నడూలేని విధంగా 50 శాతం పదవులు కేటాయించి రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సీట్లను సైతం పురుషులతో సమానంగా మహిళలకు కేటాయించే నిర్ణయం సీఎం తీసుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. కొండపిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపిస్తామని సీఎంకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు అశోక్‌బాబు అందరినీ కలుపుకొని ముందుకు నడవాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కొండపి నియోజకవర్గంలో 20 వేల మెజార్టీతో గెలవచ్చన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలే తిప్పికొడతారన్నారు. కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డిని పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. ఏఎంసీ నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లతో పాటు సూదనగుంట నారాయణ, గోగినేని వెంకటేశ్వర్లు, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావ్, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాలతో ఎన్నాళ్లు అవాకులు చవాకులు

- అభివృద్ధి అంటే చిరకాలం ప్రజల హృదయాల్లో ఉండాలి
- పార్టీ కార్యాలయం నిర్మాణం పేరుతో మైనార్టీల షాపులను ధ్వంసం చేసిన ఘనత మీది
- దామచర్ల జనార్దన్‌పై ధ్వజమెత్తిన నగర మేయర్ గంగాడ సుజాత



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: అబద్ధాలతో అవాకులు, చవాకులు పేలడం సరికాదని, అభివృద్ధి అంటే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేదని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ సోమవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే అందుకు ఓవర్ హెడ్ ట్యాంకర్లు, నూతన పైపులైను అవసరమన్నారు. దీనికోసం రూ.339 కోట్లు మంజూరు చేయించడంతో ప్రజలు స్వచ్ఛందంగా అప్పటికప్పుడు ముందుకు వచ్చి బాలినేనికి ఘన స్వాగతం పలికితే దాన్ని తట్టుకోలేక ఉక్రోషంతో ఊగిపోతూ విమర్శలు చేయడాన్ని చూసి జనం ఈసడించుకుంటున్నారన్నారు. రోడ్ల మీద రోడ్లు, కాలువల మీదు కాలువలు ఇదేగా మీ అభివృద్ధి అంటూ నిలదీశారు. 2017లో మీరు నిర్మించిన కాలువలు, రోడ్లు ఎలా ధ్వంసమయ్యాయో మీ అనుకూల పత్రికలోనే చూసుకోండన్నారు. అమృత్ పథకంలో రూ.123 కోట్లు తెప్పించి 80శాతం పనులు పూర్తిచేస్తే ఇప్పుడు ఇన్ని కోట్లు ఎందుకు అవసరం అవుతాయన్నారు. మీరు చేసిన వ్యవహారానికి 'ఇదేం ఖర్మరా బాబూ' అనుకుంటూ నగర పాలక సంస్థ ప్రతినెల రూ.60 లక్షల వడ్డీ చెల్లిస్తుందని ధ్వజమెత్తారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ రూ.339కోట్లు మంజూరు కావడంతో జనార్దన్ తట్టుకోలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వేల మందికి ఒకే ప్రాంతంలో పట్టాలివ్వబోతే మీ అనుచరులతో అడ్డుకున్నావని, మార్చిలో 25వేల మందికి పట్టాలు ఇస్తే జనార్దన్ ఉనికిని కూడా ఒంగోలు ప్రజలు మర్చిపోతారన్నారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌జలీల్ మాట్లాడుతూ ఊరచెరువును కబ్జా చేసి అందులో పార్టీ కార్యాలయం కట్టుకోవాలని అక్కడ ఉన్న మైనార్టీల దుకాణాలను ఏ విధంగా ధ్వంసం చేశారో అందరికీ తెలుసన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, కార్పొరేటర్ ఆదిపూడి గిరిశా శంకర శాండిల్య, శ్రీరామ నాగభూషణం, 2వ క్లస్టర్ జగనన్న సచివాలయాల కన్వీనర్ కొమ్మూరి రవిచంద్ర, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్తీలకు పాల్పడితే జైలే

- డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

దర్శి: ఆహార పదార్థాల విషయంలో కల్తీలకు పాల్పడితే జైలు పాలు కావాల్సిందేనని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి హెచ్చరించారు. కల్తీ పాలు తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వినుకొండ మండలం శావల్యాపురం గ్రామానికి చెందిన బోయపాటి పూర్ణచంద్రరావు కొంతకాలంగా దర్శి నగర పంచాయతీలోని ఎల్ఐసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అక్కడ పాల సెంటర్ పెట్టుకుని పాడిరైతుల వద్ద పాలు సేకరిస్తూ కేంద్రాలకు పంపుతున్నాడు. కల్తీపాలు తయారు చేయడం నేర్చుకుని కేంద్రానికి పంపే పాలలో కల్తీ పాలు కలిపి పంపుతున్నాడు. విషయం తెలుసుకున్న కొందరు ఫిర్యాదు చేశారు. డీఎస్పీకి అందించిన సమాచారం మేరకు..ఆహార భద్రతా అధికారి నరశింహుడుతో పాటు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అక్కడ సన్‌ఫ్లవర్ ఆయిల్, ఉప్పు ఇతర పదార్థాలతో కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కల్తీ పాలు తయారు చేసేందుకు ఉపయోగించే వస్తువులను, పాలను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. తయారు చేసిన కల్తీ పాలను ల్యాబ్‌కు పంపి ఆహార భద్రతా అధికారుల ద్వారా విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ రామకోటయ్య. ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

- నియామకపత్రాలు అందజేసిన కలెక్టర్
- బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పిలుపు

ఒంగోలు సబర్బన్: ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ 35 మందికి కారుణ్య నియామక పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. వివిధ శాఖలకు వీరిని కేటాయించారు. కారుణ్య కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యం లేకుండా బాధిత కుటుంబ సభ్యులకు సత్వరమే ఉద్యోగాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నందిపాలెంలో చోరీ



తెరిచి వున్న బీరువా

పొదిలి రూరల్: పొదిలి మండలం నందిపాలెం ఎస్సీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. కాలనీకి చెందిన గజ్జా అనిల్ బాబు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలోని రూ.90 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్యూఆర్ కోడ్ మార్చేసి డబ్బు కాజేశాడు

- ఎస్పీ మలికా గర్గ్‌కు మొరపెట్టుకున్న బాధితురాలు
- పోలీస్ స్పందనకు 93 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 93 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ మలికా గర్గ్ వారి సమస్యలు తెలుసుకుని భరోసా ఇచ్చారు. అర్జీలపై ప్రత్యేక శ్రద్ధతో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. టంగుటూరుకు చెందిన టి.ఆదిలక్ష్మి ఫేస్‌బుక్ ట్రెండ్స్ మెన్స్‌వేర్(వస్త్రాల దుకాణం), హెయిర్ కటింగ్ షాపులో గుమస్తాగా పనిచేయడానికిగాను కాకుటూరువారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిని నియమించుకుంది. వినియోగదారులు డబ్బు చెల్లించేందుకు వీలుగా షాపులో క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేసుకుంది. ఆమెకు తెలియకుండా క్యూఆర్ కోడ్ స్కానర్‌ను మార్చేసిన సదరు వ్యక్తి రూ.7 లక్షలను తన అకౌంట్‌కు జమ చేసుకుని మోసం చేశాడని సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఒంగోలు సాయి బాలాజీ సెక్యూరిటీ నిర్వాహకులు సెక్యూరిటీ గార్డ్స్‌గా తమను చేర్చుకుని బల్లికురవలోని ఓ గ్రానైట్ కంపెనీలో రెండు నెలలపాటు పని చేయించుకున్నారని, జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మార్కాపురానికి చెందిన టి.వెంకటేశ్వర్లుతో పాటు మరో ముగ్గురు ఫిర్యాదు చేశారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ(క్రైమ్) ఎస్వీ శ్రీధరరావు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ ఇనస్పెక్టర్ కె.రాఘవేంద్ర, ప్యానల్ న్యాయవాది బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి



సాయన్న(ఫైల్)

కురిచేడు(దర్శి టౌన్): బైక్‌ను ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి కురిచేడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కురిచేడు ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి సాయన్న(28) స్థానిక పంచాయతీ కార్యాలయంలో వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో 108లో వైద్యశాలకు తరలించేలోగా మృతి చెందాడు. సాయన్నకు వివాహమై ఏడాది కూడ పూర్తి కాలేదని, ఇంతలోనే ఘోరం జరిగిపోయిందంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై దేవకుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం తెలిపారు. సాయన్న కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర ఫిషరీస్ కోఆర్డినేటర్ షేక్ సైదా, మాజీ ఎంపీపీ ఏరువ సుబ్బారెడ్డి పరామర్శించారు. సైదా రూ.10 వేలు, సుబ్బారెడ్డి రూ.5 వేలు నగదు అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు సాల్మన్, గౌరవ అధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు సాయన్న మృతదేహానికి నివాళులర్పించారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్ఫీ వీడియో

- కాపాడిన పోలీసులు



నరేష్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

మార్కాపురం: అప్పులు బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఒక వ్యక్తి సెల్ఫీ వీడియో కుటుంబసభ్యులకు పంపాడు. కుటుంబసభ్యులు వెంటనే విషయాన్ని విజయవాడలోని డీజీపీ కార్యాలయం, ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి సమాచారమందించారు. వెంటనే మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్, సీఐ భీమానాయక్ సిబ్బందిని అప్రమత్తం చేసి వ్యక్తిని కాపాడారు. వివరాల్లోకి వెళితే..తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా జంషెడ్ గ్రామానికి చెందిన ఈడిగ నరేష్‌గౌడ్ స్వగ్రామంలో సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తేవడంతో ఇటీవల మార్కాపురంలోని భగత్‌సింగ్ కాలనీలోని అత్తగారింటికి వచ్చి ఇక్కడే సెంట్రింగ్ రాడ్ బైండింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అప్పులిచ్చిన వారు ఒత్తిడి తేవడంతో మానసిక వేదనతో సోమవారం ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ వీడియోను కుటుంబసభ్యులకు పంపాడు. వారు వెంటనే నరేష్‌ను కాపాడాలని పోలీసులకు సమాచారం అందించగా..ఎస్పీ మల్లిక్‌గర్గ్ ఆదేశాల మేరకు డీఎస్పీ కిషోర్‌కుమార్ పోలీసులను పంపించారు. వారు నరేష్‌ను అదుపులోనికి తీసుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చారు.

దక్షిణ భారతదేశ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన కనిగిరి విద్యార్థినులు

కనిగిరి రూరల్: దక్షిణ భారతదేశ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థినులు ఎంపికైనట్లు ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి, పీడీ బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు కర్ణాటకలోని అలయన్స్ యూనివర్శిటీలో దక్షిణ భారత మహిళల ఖోఖో పోటీలు జరగనున్నాయి. పోటీలకు కనిగిరి ఎంఎస్ఎం కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ప్రస్తుతం వీరు నాగార్జున యూనివర్శిటీలో జరుగుతున్న శిక్షా శిబిరంలో పాల్గొని నాగార్జున యూనివర్శిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు 15 మంది టీంలో కనిగిరికి చెందిన డిగ్రీ విద్యార్థినులు పి.అరుణ, డి.శివనాగలక్ష్మి, డి.నాగమల్లేశ్వరి, ఈ హేమావతి, బి.శిరీష, ఎం దివ్యశ్రీ, టి.అహల్య, వి.సోనియా ఉన్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, కళాశాల అధ్యాపక, సిబ్బంది అభినందించారు.



అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే..
కూతురు అమ్మకు అమ్మ అవుతుంది.
నాన్న మనసుకు కష్టం కలిగితే..
కూతురు చేయి ఓదార్పు అవుతుంది.
ఈ పదేళ్లలో ప్రభుత్వాలు, ప్రజలలోనూ
బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగింది.
ప్రపంచ వేదికపై బాలికలు తమ గళాన్ని వినిపించడానికి
మరిన్ని అవకాశాలు పెరిగాయి.
అయినప్పటికీ, బాలికల హక్కులపై
అవగాహన పరిమితంగానే ఉంది.
బాలికలు తమ సామర్థ్యాన్ని నెరవేర్చుకోవడానికి
సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు
వారి అడుగులకు మరింత ఊతాన్ని ఇవ్వాల్సిన తరుణమిది.
'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా
ఈ విషయంపై దృష్టి సారిద్దాం..

నేషనల్ గర్ల్ చైల్డ్ డే

ఒక్క చిరునవ్వు... కోటి కాంతులు

'కూతుళ్ళే మన భవిష్యత్తు' అనే మాటని మన ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాలలో చెప్పడం పదే పదే విన్నాం. వివిధ రంగాలలో మహిళల విజయాలను గుర్తిస్తున్నాం. ఆడపిల్లల సాధికారతకు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. అయినా 'ఆమె' పురోగతికి కుటుంబం, సమాజం చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

కుటుంబంలో స్కీమ్స్

ఒకప్పుడు కూతురు ఇంటి గుండె మీద కుంపటి. ఇప్పుడు కుటుంబ సమస్యలను ఓ దరిచేర్చగల చుక్కాని. అందుకే పుట్టేది ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా 'సరే' అనే దిశకు కుటుంబం చేరుకుందనే చెప్పాలి. కానీ, 'ఆమె' పెరుగుదలలో ఇంటి నుంచే ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లితండ్రులే అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్కీమ్స్ పెడుతుండాలి. ఆమె కలలకు, ఆశయాలకు మద్దతునివ్వాలి. ఎలాంటి సమస్య అయినా 'పరువు' అనే భయంతో కాకుండా బలమైన వెన్నుగా నిలవాలి.

డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్

ఈ నినాదం ఇప్పుడు బాలికలకు అత్యవసరమైనది. డిజటల్ యుగంలో 'ఆమె'కు వాటి వినియోగంలోనూ పూర్తి అవగాహన అవసరం. ఇప్పటికే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు డిజిటల్ పరికరాల వాడకంలో వెనకంజలో ఉన్నట్టు ప్రపంచవ్యాప్త అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమం ద్వారా అమ్మాయిలను ప్రభావంతంగా మార్చే మానవ ఆసక్తి కథనాలు, బ్లాగ్‌లు, వీడియోలు, రీసోర్సింగ్ చేసే స్ఫూర్తిదాయకమైన నెట్‌వర్క్‌లు, సంస్థల గురించి తెలుసుకునే అవకాశాలను కల్పించాలి.

చట్టం.. హక్కులు

సమాజంలో ధైర్యంగా, శక్తిమంతంగా ఎదిగేందుకు ఆమె చుట్టూ ఉన్న రక్షణ, న్యాయ వ్యవస్థల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కుటుంబంతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది.

నాయకత్వాన్ని పెంచుదాం

అవగాహన 'ఆమె'కు అవకాశాలను విస్తృతం చేస్తుంది. నాయకత్వాన్ని ఎంచుకునేలా ఎదగాలంటే ..

- మన ప్రాంతంలోని అమ్మాయిలను వెనక్కి నెట్టివేసే అంశాల గురించి అవగాహన పెంపొందించడంలో, వాటిని పరిష్కరించడంలో ముందుండాలి.
- బాలికలకు అందాల్సిన సేవలను మరింతగా బలోపేతం చేయాలి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా వారి నాయకత్వం, చర్యలు, ప్రభావాన్ని సమష్టిగా విస్తరింపజేయాలి.
- ప్రపంచవ్యాప్తంగా బాలికలు లింగ అసమానత, వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇవి బాలికలను ప్రతిచోటా వెనకడుగు వేయిస్తున్నాయి. అందుకే లైంగిక వేధింపులు, హింస, అసమానతలు, హక్కుల గురించి అవగాహన కల్పించడంలో వెనకంజ వేయకూడదు.
- విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతలను తెలియజేయడమే కాదు వాటిని అందించడంలోనూ ముందంజలో ఉండాలి.
- అమ్మాయిలు తమలోని ప్రతిభను కనబరచడమే కాకుండా పూర్తి స్వేచ్ఛతో జీవించే అవకాశాన్ని కల్పించాలి.
- చాలా ప్రాంతాలలో అమ్మాయిలను త్వరగా పెళ్లి చేసుకోమని బలవంతం చేయడం లేదు. అయినా, ఎలాంటి హింస జరిగినా ఆడపిల్లలకు తమ గొంతు వినిపించే హక్కు ఉంది. ఈ విషయాన్ని వారికి తప్పక తెలియజేయాలి.
- రోల్ మోడల్స్‌గా ఉన్నవారిని బాలికలకు పరిచయం చేయిస్తూ ఉండాలి. బాలికా నాయకత్వం పట్ల ప్రజలలో అవగాహనను పెంచాలి.
- అలజడులు, వలసలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సామాజిక సహాయ సేవలను పొందుతున్నప్పుడు బాలికలు అనుభవించే అసమానతలను పరిష్కరించడానికి అధికారులు, విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాలి.

ఒక ఆడపిల్ల తన స్వచ్ఛమైన చిరునవ్వుతో ఇంటిని ప్రకాశవంతం చేస్తుంది. జీవితాన్ని ఎలా గడపాలో నేర్పేది ఆమె. కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ప్రేమలో పడేలా చేసే స్వచ్ఛమైన ఆత్మ. కాబట్టి ప్రతి ఇంటినీ తన నిస్వార్థ ప్రేమతో, ప్రకాశంతమైన కాంతితో నింపే ఆమె భవిష్యత్తును ఉజ్వలం చేద్దాం. సమాజంలో సమానమైన అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిద్దాం.

బాల్య ముద్రలు

ఆ నీలి రంగు గౌను

బాల్యం మళ్లీ దొరకని
సీతాకోకచిలుక.
బాల్యం మనిషికి
తన అమలిన రూపాన్ని చూపే అద్దం.
బాల్యాన్ని తలుచుకోని వారు ఉండరు.
బాల్యం ఏర్పరిచే గాఢమైన ముద్రలే
మనిషి భవిష్యత్తు ప్రయాణాన్ని
ప్రభావితం చేస్తాయి.
'నా గురించి నేను
రాసుకోవాలనుకున్నప్పుడు
ఎన్ని సినిమాలు చేశాను,
ఎవరితో సినిమాలు చేశాను
రాయాలనిపించ లేదు.
నా బాల్యం గురించే రాసుకోవాలనిపించింది'
అంది నటి దీప్తి నావల్.
'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆమె
తన పుస్తకం 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'
గురించి మాట్లాడింది.
బాల్య జ్ఞాపకాలు పంచుకుంది.



'నాకు ఊహ తెలిశాక వచ్చే మొదటి జ్ఞాపకం... ఒక రోజు సాయంత్రం మా ఇంట్లో అమ్మ లేదు. జేజిని అడిగితే ఉత్తుత్తికే సినిమాకెళ్లిందిలే అంది. అమృత్‌సర్‌లో మా ఇల్లు హాల్ బజార్‌లో ఉండేది. సినిమా హాలు మా ఇంటి దగ్గరే. నేను ఇంట్లో నుంచి బయటకు గెంతి అమ్మ దగ్గరకు వెళతాను అని సినిమా హాలు వైపు పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. అప్పుడు గాలి దుమారం రేగింది. వీధిలో చెత్త పైకి రేగింది. షాపులు దుమ్ముతో నిండిపోయాయి. నేను మాత్రం హాలు వైపు పరిగెడుతూనే ఉన్నాను. నా వెనుక మా జేజీ. ఆ గాలిలో అర్థమయ్యీ కాక ఎటు వెళ్లేదాన్నోగాని మా జేజి గబుక్కున నన్ను జవురుకొని ఇంటికి తీసుకెళ్లింది. తీసుకెళ్లాక ఆమె అన్న మాట- మంచి ఇంటి ఆడపిల్లలు సినిమా కు వెళ్లకూడదమ్మా అని. ఏ ముహూర్తాన ఆమె ఆ మాట అన్నదో (నవ్వు). నా జీవితం మొత్తం సినిమాల్లోనే గడిచింది'....

ఇందిరాగాంధీ 1966 జనవరి 24న దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు.అందుకే ప్రభుత్వం ఈ రోజుని జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేకంగా ఎంచుకుంది. భారత ప్రభుత్వం 2008లో ఆడపిల్ల పట్ల సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24ని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది.

•••

'సినిమాల్లో నేను ఎన్నో కాస్ట్యూమ్స్ తొడుక్కుని ఉంటాను. రోజువారీ జీవితంలో ఫ్యాషన్లు ఫాలో అయి ఉంటాను. కాని నాకు ఇష్టమైన బట్టలు అంటే చిన్నప్పుడు నేను తొడుక్కున్న నీలి రంగు గౌనే. ఆ కథ నాకు చాలా ఇష్టం.

అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయి. మా ఇంటికి ఏదో మేగజీను వచ్చేది. అందులో ఒక అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఇద్దరు పాపలు ఒకే లాంటి నీలి రంగు గౌన్‌లలో నిలబడి ఉంటారు. మా అమ్మ ఆ ఫొటో చూసి' పండక్కు ఇలాంటి గౌన్లు వేయాలి మీకు' అంది నాతో మా అక్కతో. దీపావళి పండగ దగ్గర్లో ఉంది. దీపావళికి కొత్త బట్టలు తొడుక్కుని టపాకాయలు కాల్చడం ఆనవాయితీ. మా అమ్మ ఇంట్లో ఒక తెల్ల గుడ్డ ఉంటే మమ్మల్ని తీసుకుని అద్దకం దుకాణానికి తీసుకు వెళ్లింది. మేగజీన్‌లోని ఫొటో చూపించి ఆ బట్టకు అదే రంగు నీలం వేయమని చెప్పింది. అతడు తలాడించాడు. మామూలు నీలం కాదు ఇది... పర్షియన్ నీలం... అలాగే ఉండాలి అంది మా అమ్మ. అతను మళ్లీ సరే అన్నాడు. మొత్తం మీద నీలంగుడ్డ మా ఇల్లు చేరింది. ఇక గౌనుగా మారాలి.

మా అమ్మకు బట్టలు కుట్టడం ఆసక్తే అయినా పండగ బట్టలు కాబట్టి మా వీధిలో ఉండే శిక్కు దర్జీకి ఇచ్చింది. ఆయన అప్పటికే కుప్పలు తెప్పలుగా పండగ గుడ్డలు కుట్టే పనిలో ఉన్నాను. పండక్కు ఇస్తానని మాట ఇచ్చాడు. మా ఇంటి నుంచి ఆ దర్జీ షాపు కనిపిస్తుంది. నేను మా అక్క రోజూ షాపు వైపు చూసేవాళ్లం. షాపు దాకా వెళ్లి మా గుడ్డ కదిలిందో లేదో చూసేవాళ్లం.

పండగ వచ్చింది. సాయంత్రమైపోయింది. అందరూ టపాకాయలు కాల్చడం మొదలెట్టారు. మేమిద్దరం మాకు చేరని నీలి రంగు గౌన్లను తలచుకుని మొహం మాడ్చుకుని కూచున్నాం. టపాకాయలు కాల్చలేదు. ఏడూ ఎనిమిది అయిపోయింది. మా బజార్‌లో షాపులన్నీ మూత పడిపోయాయి. దర్జీ షాపు లైటు ఒక్కటే వెలుగుతూ ఉంది. ఆ తర్వాత భోజనాలు చేశాం. వీధిలో టపాకాయల మోత ఆగిపోయింది. మేము పైజామాల్లోకి మారి నిద్రపోబోతున్నాం. అప్పుడు మా ఇంటి గేటు తట్టిన చప్పుడు అయ్యింది. నేను పరిగెత్తాను ఎవరొచ్చారో అర్థమయ్యి. ఆలస్యానికి మన్నింపు కోరుతున్న ముఖంతో రెండు నీలం రంగు గౌన్లు పట్టుకుని దర్జీ.

ఓ.. మేము వెంటనే ఆ గౌన్లు తొడుక్కుని అప్పుడు పండగ మొదలెట్టాం. టపాకాయలు కాల్చి వీధి వీధంతా నిద్ర లేపాం. పదే పదే నేను ఇష్టంగా తలచుకునే జ్ఞాపకం ఇది.

•••

మా అమ్మ అప్పుడప్పుడు పొరుగునే ఉన్న పేదపిల్లల బడికి వెళ్లి పాలు పంచి వచ్చేది. ఒకరోజు అమ్మతో పాటు నేనూ వెళ్లాను. చాలా మంది చిన్న పిల్లలు అమ్మ దగ్గరకు వచ్చి ఆమె పంచుతున్న పాలు తీసుకుని తాగి సంబర పడ్డారు. మేము తిరిగి వస్తుంటే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ గిన్నె పట్టుకుని వచ్చాడు. 'అయ్యో... నాన్నా పాలు అయిపోయాయి. ఇంత ఆలస్యం ఏంటి?' అంటే వాడు నిరాశ నిండిన ముఖంతో 'మా ఇంట్లో గిన్నె లేదు. అమ్మ వేరే ఇంటి నుంచి తెచ్చి ఇచ్చింది' అన్నాడు.

మన దేశ పేదరికం గురించి నా మనసు మీద శాశ్వత ముద్ర వేసిన సంఘటన అది.

•••

నాకు పద్నాలుగేళ్లు ఉండగా నా స్నేహితురాలికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఆ రోజుల్లో పిచ్చి పట్టడం అంటే వారిని బహిష్కరించడమే. ఆ అమ్మాయికి అలా కావడంతో నేను చాలా డిస్ట్రబ్ అయ్యాను. ప్రతి వీధిలో చాలామంది ఆడవాళ్లు అలాంటి స్థితిలో కనిపించేవారు. మేము జట్కాలో స్కూలుకు వెళుతుంటే ఒకామె మా వెనుకే పరిగెత్తేది. నాకు చాలా బాధ కలిగేది. వారికి ఏదైనా చేద్దామనే నేను అమెరికాలో సైకాలజీ చదివాను. ఇప్పటికీ నేను మానసిక ఆరోగ్యం సరిగా లేని స్త్రీల గురించి ఆలోచిస్తాను. వారికి నేటికీ సరైన వైద్యం అందడం లేదు. నేను నా కవిత్వ పుస్తకంలో ఎన్నో కవితలు మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన స్త్రీల గురించి రాశాను. రాస్తాను.

దీప్తి నావెల్ జీవితంలోని ఇలాంటి అనేక అంశాలు 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'లో ఉన్నాయి.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

అమృత్ పత్తి అదుర్స్!





మొదటి రెండు వరుసల మధ్య 4 అడుగులు, తర్వాత రెండు వరుసల మధ్య 6 అడుగుల దూరం చొప్పున పాటించి సాగు చేసిన పత్తి చేను



పత్తి తొలి దశలో మొక్కకు ఎక్కువగా వచ్చిన కొమ్మలు.. కాయలను చూపుతున్న రైతు విజయ్ (ఫైల్)

ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించిన ఆదిలాబాద్ జిల్లా రైతు

మహారాష్ట్రకు చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ రూపొందించిన పద్ధతి ఇది

పత్తి దిగుబడుల పరంగా ఎకరానికి 20 క్వింటాళ్లు సాధించిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హారికి చెందిన యువ రైతు ఫడ్ విజయ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెట్టింపు దిగుబడి సాధించిన విషయం ఆ నోటా ఈ నోటా తెలుసుకొని పరిసర గ్రామాల రైతులు ఆసక్తిగా పొలాన్ని చూసి వెళ్తున్నారు. సాధారణ సాగులో కొంత మందికి 6 నుంచి 8 క్వింటాళ్లు, మరికొంత మందికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే, ఈ రైతు ఏకంగా రెట్టింపు కంటే అధిక దిగుబడి సాధించడమే రైతులను ఆకర్షిస్తోంది.

ఫడ్ విజయ్‌కు మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అంబోడ గ్రామంలో చుట్టాలు ఉన్నారు. ఒకసారి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అమృత్ ప్యాటర్న్‌లో సాగు చేయడాన్ని గమనించాడు. దిగుబడి అధికంగా వస్తుందని ఆ రైతులు చెప్పడంతో ఆ వైపు మొగ్గు చూపాడు.

అమృత్ పద్ధతి అంటే..?

యవత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా అంభోద గ్రామానికి చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ తన క్షేత్రంలో అనేక ఏళ్ల పాటు ప్రయోగాలు చేసి ఈ సాగు పద్ధతిని రూపొందించారు. అందువల్లనే అమృత్ ప్యాటర్న్ అని పేరు వచ్చింది. ఏకంగా 50 క్వింటాళ్ల వరకు ఎకరంలో పత్తి దిగుబడి సాధించిన ఘనత ఆయనిది.


ఆదిలాబాద్ జిల్లాలో సాధారణంగా పత్తి సాగులో రైతులు మొక్కల మధ్య కొంచెం అటూ ఇటుగా ఒక అడుగు, వరుసల మధ్య 3 నుంచి 4 అడుగులు లేదా 4 నుంచి 5 అడుగుల దూరం పాటిస్తారు. అమృత్ ప్యాటర్న్‌లో మొక్కల మధ్య దూరం కచ్చితంగా ఒక అడుగు ఉండే చూస్తారు. ఒక వరుస మధ్య 4 అడుగులు, ఆ పక్కన వరుస మధ్య దూరం 6 అడుగుల దూరం పాటిస్తారు. అంటే.. మొదటి రెండు వరుసల మధ్య దూరం నాలుగు అడుగులు.. రెండు, మూడు వరుసల మధ్య ఆరు అడుగుల దూరం అనుసరిస్తారు. ఇదే తీరులో చేనంతా పాటిస్తారు. ఇదే విధానాన్ని విజయ్ అవలంభించారు.



ఏడు అడుగులు పెరిగిన పత్తి చేనులో విజయ్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

అమృత్ పద్ధతిని అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడే అవసరం పడదు. కలుపు తీయడంతో పాటు ఎరువులు, మందుల ఖర్చుల్లో చాలా ఆదా అవుతుంది. అధిక సాంద్రతతో పూత, కాత రావడం జరుగుతుంది.



– సాయిప్రణీత్ (96768 83233), వ్యవసాయ విస్తరణాధికారి, కొల్హారి గ్రామం

నెల తర్వాతే ఎరువులు..

పత్తి సాగులో మొదటి నెల రోజుల పాటు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడలేదు. ఇలా చేయటం వల్ల మొక్కకు కొమ్మలు ఎక్కువగా వస్తాయి. విత్తిన నెల తర్వాత ఎకరాకు ఒక బ్యాగు 10:26:26 వేశారు. ఆ తర్వాత నెలలోనూ అదే మోతాదులో అదే ఎరువుతో పాటు అతి తక్కువ ధరకు లభ్యమయ్యే పురుగుల మందు వాడినట్టు వివరించారు.

సాగు పద్ధతి మార్చుకొని అధిక దిగుబడి సాధించా...

రెండేళ్ల కింద పత్తి సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మహారాష్ట్రలో కొంతమంది రైతులు అవలంభిస్తున్న అమృత్ ప్యాటర్న్‌లో గతేడాది పత్తి సాగు చేశాను. కొన్ని కాయలు కూడా కుళ్లిపోయాయి. అప్పుడు 9 నుంచి 11 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చింది. అమృత్ విధానాన్ని పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో దిగుబడి అంతకు పరిమితమైంది. రెండో ఏడాది.. గడిచిన వానా కాలంలో ఈ విధానంలో అమృత్ ప్యాటర్న్‌లో అన్ని పద్ధతులను పూర్తిస్థాయిలో అవలంభించాను. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది.

– ఫడ్ విజయ్ (77024 42958), ఇన్నోవేటివ్ పత్తి రైతు, కొల్హారి గ్రామం, గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

మూడో నెల తర్వాత 5 కేజీల సల్ఫర్, ఆ తర్వాత 25 కేజీల మెగ్నీషియం నెలకు అందిస్తే సరిపోతుందని విజయ్ తెలిపారు. తద్వారా ప్రతి మొక్కకు వచ్చే కొమ్మలైనా ప్రధాన కొమ్మ, పిల్ల కొమ్మలు చాలా తక్కువ దూరంలో వస్తాయని తెలిపారు. పూత, కాత ఎక్కువగా రావడంతో పాటు రాలిపోకుండా ఉంటాయని విజయ్ వివరించారు.

సాళ్ల మధ్య ఎక్కువ దూరం పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని అనుభవపూర్వకంగా విజయ్ చెబుతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చయ్యింది. 20 క్వింటాళ్ల పత్తి తీసిన తర్వాత మళ్లీ నీటి తడి ఇచ్చారు. ఫలితంగా మున్ముందు కూడా మరికొంత పత్తి దిగుబడి రావచ్చని విజయ్ ఆశిస్తున్నారు.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్, సాక్షి, ఆదిలాబాద్.

సాగుబడి
శ్రావణ కార్తె
జనవరి 24 నుంచి

మొబైల్ ఈవీ కూరగాయల కూలర్!

- తెలంగాణ నాబార్డ్ తోడ్పాటుతో రూపొందించిన పుణే స్టార్టప్ రుకార్ట్
- రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయం 150% పెరిగే అవకాశం



మొబైల్ ఈవీ సబ్జీ కూలర్

చిన్న, సన్నకారు కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం పెంపొందించే లక్ష్యంతో మహారాష్ట్ర పుణేకు చెందిన నలుగురు ఐఐటీయన్లు 'రుకార్ట్' పేరిట స్టార్టప్ సంస్థను స్థాపించి ఏ రకమైన విద్యుత్తూ అవసరం లేని కూరగాయలు, పండ్లను నిల్వ ఉండే కూలర్‌ను రెండేళ్ల క్రితమే రూపొందించారు. ఇప్పుడు విద్యుత్ బ్యాటరీతో నడిచే వ్యాన్‌కు సబ్జీ కూలర్‌ను నాబార్డ్ తోడ్పాటుతో అనుసంధానించారు.

సబ్జీ (కూరగాయల) కూలర్‌లో వంద కిలోల ఆకుకూరలు, పువ్వులు, కూరగాయలను 4 నుంచి 6 రోజులు తాజాదనం పోకుండా నిల్వ చేయవచ్చు. అందుకు ఈ సబ్జీ కూలర్‌కు కావాల్సింది రోజుకు 20 లీటర్ల నీరు మాత్రమే. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పర్యావరణ అనుకూలమైన 'మెరుగైన ఆవిరి శీతలీకరణ' ఆధారిత ఆటోమైజ్డ్ కోల్డ్ స్టోరేజీని రుకార్ట్ సంస్థ అందిస్తోంది.

ప్రత్యేక మెటల్‌తో తయారు చేసిన సబ్జీ కూలర్ గోడలోకి నీరు పోయాలి. బయటి వాతావరణంలో వేడి వల్ల ఈ నీరు ఆవిరవుతూ లోపలి కూరగాయలకు చల్లదనాన్నిస్తుంది. ఇది ఉద్యాన ఉత్పత్తులను తాజాగా నిల్వ ఉంచడానికే కాదు.. అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి మొదలైన పండ్లను సహజంగా మగ్గబెట్టే గదిగా కూడా పనిచేస్తుందని తయారీదారులు చెబుతున్నారు.



సబ్జీ కూలర్

సబ్జీ కూలర్ అరెకరం కూరగాయల లేదా పండ్ల తోట ఉన్న రైతుకు లేదా తన ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే రైతుకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని పొలం దగ్గర లేదా ఇంటి దగ్గర లేదా మార్కెట్‌లో ఆరుబయట, గోదాములలో సులువుగా ఏర్పాటు చేసుకోవచ్చు. 5 రాష్ట్రాల్లో రైతులు, బెంగళూరులోని సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, ఏలూరులోని హరిత మిత్ర వంటి ఎఫ్.పి.ఓ.లు, రిటైల్ అమ్మకందారులు ఇప్పటికి 425 సబ్జీ కూలర్లను ఉపయోగిస్తున్నారు.

మొబైల్ కూలర్‌తో మరింత ఆదాయం

తెలంగాణ నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో రుకార్ట్ సంస్థ విద్యుత్ బ్యాటరీతో నడిచే మొబైల్ సబ్జీ కూలర్ వ్యాన్‌ను రూపొందించింది. సిద్దిపేట జిల్లా ములుగులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పి.ఓ.)లో ఈ నెల 23న దీన్ని ఆవిష్కరించారు. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకొనే రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయాన్ని 150% పెంపొందిస్తుందని మొబైల్ ఎలక్ట్రిక్ సబ్జీకూలర్ వ్యాన్ దోహదపడుతుందని రుకార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వికాస్ ఝా తెలిపారు.

మొబైల్ సబ్జీ కూలర్ పూర్తి చార్జింగ్‌తో గంటకు 25 కి. మీ. వేగంతో వంద కి.మీ. నడుస్తుంది. 350 కిలోల వరకు బరువు మోస్తుంది. కూరగాయలు, పూలు, ఆకుకూరల రంగు, తాజాదనం, దృఢత్వాన్ని కాపాడుతుంది. వృథాను 15% అరికడుతుంది. దీనిపై పెట్టే పెట్టుబడిని 7 నెలల్లోనే తిరిగి రాబట్టుకోవచ్చని వికాస్ ఝా వివరించారు. వివరాలకు.. 88790 49787, 88956 341918.

మార్చి నుంచి మెత్తళ్ల/పరిగెల సీడ్ సరఫరా



విటమిన్ 'ఎ' తదితర పోషకాలు పుష్కలంగా ఉండే చిరు చేపలు మెత్తళ్ల (పరిగెల) విత్తనోత్పత్తిలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం గురించి ఈ నెల 10న 'సాక్షి సాగుబడి' కథనం ద్వారా తెలుసుకున్నాం కదా. మెత్తళ్ల సీడ్ మనకు ఎప్పటికి చేతికి అందుతుందీ అని పలువురు రైతులు ఆత్రుతను వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో సీడ్ ఉత్పత్తి చేసిన హేచరీని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. మార్చి నెల నుంచి సీడ్‌ను విక్రయిస్తామని ఒడిషాలోని బిశ్వాల్ ఆక్వా ఫామ్ అండ్ హేచరీ అధిపతి సౌరబ్ కుమార్ బిస్వాల్ 'సాక్షి'కి తెలిపారు. జగత్సింగ్‌పూర్ జిల్లా తులంగ గ్రామంలో ఈ హేచరీ ఉంది. భువనేశ్వర్ నగరానికి 100 కి.మీ. దూరంలో తారాదీప్ వెళ్లే మార్గంలో తులంగ ఉంటుంది. మెత్తళ్ల ఫిష్ స్పాన్ (50-60 గంటల వయసున్న పిల్లలు)ను మార్చి మొదటి వారం నుంచి రైతులకు విక్రయిస్తారు. లక్ష స్పాన్ ధర రూ. 1,500. ఫ్రై (10-15 రోజుల పిల్లలు)ని మార్చి 15 నుంచి సరఫరా చేస్తారు. వెయ్యి ఫ్రై ధర రూ. 200. ఆగస్టు-సెప్టెంబర్ వరకు మెత్తళ్ల సీడ్ ఉత్పత్తి, సరఫరా జరుగుతుంది. పాలిథీన్ బ్యాగ్‌లలో చేప పిల్లలను ఆక్సిజన్‌తో పాటు నింపి సిద్ధం చేసిన తర్వాత 30 గంటల్లోగా గమ్యం చేర్చాలని బిస్వాల్ తెలిపారు. రోజూ ఆంధ్రప్రదేశ్‌కు 10-15 ఇన్సులేటెడ్ వ్యాన్లు వెళ్తూ ఉంటాయని, వాటిలో మోల సీడ్‌ను తరలించవచ్చన్నారు. ఇతర వివరాలకు.. 93376 62527.

26 నుంచి సేంద్రియ సాగు, విలువ జోడింపుపై 3రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో 3 రోజుల రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉ. 10 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నెంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భోజనం, వసతి సదుపాయం ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది ఏపీ రైతులకే ఈ అవకాశం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్